# సినీ తిమింగలం



**ఉదయశంకర్**

మేనెల మధ్యాహ్నం 12-30 కావొస్తోంది. ఉస్మాన్ రోడ్డుని క్రాస్ చేసే బజుల్లా రోడ్ వద్ద కారు ఆగింది. కారులో నుండి తెల్ల లుంగీకాలర్ లేని హాఫ్ హాండ్ వైట్ షర్టు ధరించిన ఒక వ్యక్తి దిగి ఎడమ వైపు ఫుట్‌పాత్ మీదుగా నడక ప్రారంభించాడు.

"హల్లో! అన్న గొంతు విని కుడి వైపుకు చూచి "హల్లో" అని తనూ గ్రీట్ చేశాడు.

"ఏమిటిలా పోతున్నారు?" అన్నాడు అవతలి వ్యక్తి.

"ఏముందిసార్ మా బ్రతుకులు మీకు తెలియవూ! తెల్లవారుఝామునే వచ్చి నిద్రలేపి మరీ తీసుకెళ్ళారు, మార్నింగ్ కాల్‌షీట్ అర్జంటంటూ.

హీరోయిన్ని చిన్నప్పుడు పెంచిన పనివాడి వేషం వుందని చెప్పారు. తీరా పన్నెండుంపావయ్యింది. మీ షాట్ రేపు తీద్దాం అన్నాడు డైరెక్టర్. దాంతో బ్రేక్ చెప్పేశారు. డ్రైవర్ నన్ను తీసుకొచ్చి యిక్కడ దించేడు." అంటూ తన బాధంతా వెళ్ళగక్కాడు క్రిష్ణమూర్తి.

"అలాగా! అరె అంటూ కళ్ళకున్న నల్లద్దాలు ఒకసారి తీసి తుడుచుకున్నాడు. హీరో వేషాల కోసం తిరుగుతున్న రవికిరణ్ అనే కొత్త కుర్రవాడు.

యిద్దరూ నడుస్తూపోతున్నారు ఫుట్‌పాత్ మీదుగా వారి ప్రక్కగా ఒక బెంజ్ కారు శబ్దం లేకుండా దూసుకుపోయింది.

ఇద్దరూ ఒక్కసారి ఆ కారులో వున్న పెద్ద హీరోకి చేతులెత్తారు, తమ ఉనికిని ఎరిగిస్తూ...

"సార్ కాఫీ త్రాగుదాం" అంటూ క్రిష్ణమూర్తిని బలవంతంగా ప్రక్కనే వున్న కాఫీ హోటల్లోకి లాక్కెళ్ళాడు కొత్త హీరో.

"అవున్సార్... మీరు కైకా ఫిలింస్‌వాళ్ళ పిక్చర్లో వున్నారా! మీ పేరు చిన్న మేగజైన్‌లో చూశాను" అన్నాడు!

"నేను సార్! ఆయనేరో ఆయన! అదే ఈ మధ్య చాలా మంది కన్ఫ్యూజై వన్నడుగుతున్నారు.

"మీరు సీనియరా! ఆయన సీనియరా...?"

'ఆయనొచ్చింది మొన్ననే, లాస్టియర్!

నేనొచ్చి బహుశా మీరు పుట్టరదుక పోవచ్చు. 1955లో అనుకుంటా ఎల్.వి. ప్రసాద్ గారు కొత్త ఆర్టిస్టులకు అవకాశం అని ప్రకటిస్తే అది చూసి, అప్పటికి పని చేస్తున్న అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ ఎల్.డి.సి. ఉద్యోగానికి రిజైన్ చేసి వచ్చాను.

ఇప్పుడాఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఫుడ్ లేకుండా..." అంటూ ఘనమైన తన గతాన్ని చెప్పాడు క్రిష్ణమూర్తి.

ఇదంతా ఆ వెనుక కుర్చీలో వున్న ఓ వ్యక్తి శ్రద్ధగా ఆలకిస్తూ మధ్య ఓ సారి వెనుదిరిగి చూస్తున్నారు.

"అవున్సార్ మోహన్ రెడ్డి ముందా! మీరు ముందా సార్?" అన్నాడు కొత్త హీరో కనీసం సీనియారిటీ ఇన్ఫర్మేషన్ అయినా తెలుస్తుందని.

"ఆయనా నేనొచ్చిన రెండేళ్ళకు వచ్చాడు" అన్నాడు కృష్ణమూర్తి.

"కానీ ఈ రోజున కథా రచయిత నంటాడు, యాక్టర్, ప్రొడ్యూసర్, డైరెక్టర్ కూడాను..."

"ఏముంది సార్ రవికిరణ్‌గారూ! కొత్త కుర్రవాళ్ళు ఏవో కథలు వ్రాసుకుని మద్రాసొచ్చి నాలుగాఫీసులు తిరుగుతారు. అలాగే ఈ రెడ్డి దగ్గరకి వెడుతారు.

రెడ్డి కథ వింటాడు, ఒక వేళ వినే ఓపిక లేకపోతే, నాకు కథ యిచ్చి రేపురా, చదివి చూస్తాను పనికొస్తదో లేదో... మా బేనర్ మీద నువ్వు రైటర్‌గా నిలబడుదువుగాని అంటూ పైకిఎత్తుతాడు మాటలతో.

అంతే ఆ కుర్రవాడు ఆత్రేయంతైనట్లు కాలరెగరేస్తూ వెళ్ళిపోతాడు. ఆ మర్నాడు - మరోనాడు - నాలుగోనాడు తిరుగుతాడు ఆఫీసు చుట్టూ కుర్రవాడు.

"కథ చేతికిస్తూ...... బలమైన సెంట్ మెంట్ కావాలి బాబూ" ట్రైచేసి చూడు ఏదైనా వుంటే,... అంటాడీ మోహన్ రెడ్డి. యింకా ఆ కుర్రాడికి ఓపిక, సహనం వుంటే ఏదో రాసిందల్లా తీసుకొచ్చి యిస్తుంటాడు.

అలా తీసుకొచ్చిన మల్లారెడ్డి ఓ కుర్రవాడితో కాఫీలు తెప్పిస్తుంటాడు ఇంటి దగ్గర. ఓపిక, జేబులో డబ్బులు ఖాళీ అయ్యాక యింకా ఆ కుర్రవాడు ఆ ఛాయలకి రాడు. రెడ్డికి యిలాంటి స్క్రిప్ట్ గేదరింగ్

చాలా వుంటుంది. ఇక డైరెక్షన్ అంటారా! లైట్ బాయి కూడా చేస్తాడు, రోజా అన్నీ చూస్తున్నాడు కాబట్టి.

"ఈరోజున సాహిత్యం, సంగీతం, 'యిలా వుండాలి' అని, కథ - కథనం సమర్థవంతంగా, ప్రేక్షకుడికి వచ్చే విధంగా ఆలోచించి సినిమా తీసేవాళ్లెంతమంది సార్?

సినిమా ఫార్ములా అందరికీ తెలుసు-మూడు డ్యాన్సులు, నాల్గు ఫైట్‌లు, రెండు రెయిన్ సాంగ్స్ - అంటూ సుదీర్ఘంగా ఒక లెక్చర్ దంచాడు చేతిలో వడ ముక్క వెయిట్ చేయడంతో దాన్ని నోట్లోకి తోశాడు.

క్రిష్ణమూర్తికి రవికిరణ్‌తో పరిచయం ఇద్దరూ కలిసి ఒక పిక్చర్లో పనిచేయడంతో జరిగింది. ఇది మూడో సారి కలుసుకోవడం వాళ్ళుభయులూ...

రవికిరణ్ వడముక్కలు విరిచి సాంబార్ గిన్నెలో స్పూన్‌తో వేస్తున్నాడు.

చేతికి రెండు పెద్ద వుంగరాలు, మెడలో ఒక గోల్డు చెయిన్ చూసే సరికి.

ఏదో బాగా వున్న బాపతే, సినిమా పిచ్చికొద్దీ వచ్చుంటాడు' అని మనసులో అనుకోసాగాడు.

'సరే ఎందుకైనా మంచిది, కుర్రవాడు మనమంటే ఒక అభిమానం చూపిస్తున్నాడు, ఇప్పుడున్నవాళ్ళ మీద చాలా బెటర్! ఒక ముక్క కదలేసి చూస్తే ఏమంటాడో చూద్దాం అనుకుని...

"కిరణ్‌గారూ! ఏదైనా మంచి పార్టీ వుంటే చూడండి, మన దగ్గరొక మంచి సబ్జెక్టుంది." అంటూ టీ చెప్పాడు సర్వర్‌కి.

"చూద్దాం అండి" అన్నాడు కొత్త కుర్రవాడు.

* * *

ఆ రోజు జగదాంబ పిక్చర్స్ షూటింగ్ జరుగు తోంది ఎ.వి.ఎమ్.లో. తన షాట్ అయిపోవడంతో సిగరెట్ ఊదుకుంటూ వస్తున్నాడు బైటికి కృష్ణమూర్తి.

"ఏమండోయ్ క్రిష్ణమూర్తిగారు!" అన్నదొక గొంతు చెట్టు క్రింద నుండి అటువైపు చూసి," హల్లో సార్, బహుకాల దర్శనం - ఏమిటి ఈ మధ్య అసలు దర్శనం లేదు - చూస్తున్నాం బిజీగా కన్పిస్తున్నారు అన్ని పిక్చర్లోనూ మీ పేరే..."

"ఏదో మీ దయ..." అన్నాడు అవతలి వ్యక్తి, విలన్ వేషం రంగారావు "మా దయేముంది సార్ -



భగవంతుడి దయ అనండి..."

"సరే కాని క్రిష్ణమూర్తిగారూ, ఒక్క మాట మీతో చెప్పాలని చాల రోజులు నుండి ఎదురు చూస్తున్నాను.

అంతమందిని చూశాం కాని, ఒక్కళ్ళూ చెప్పలే దండి కరెక్టుగా, శ్రీనివాస్ తీసుకొచ్చిన ఒంగోలు సిద్ధాంతిగాని' మీరు తీసుకొచ్చిన బెజవాడ సిద్ధాంతిగాని, ప్రొడక్షన్ చెంగయ్య తెచ్చిన అనకాపల్లి దేవీ ఉపాసకుడు గాని, స్టిల్స్ ఆయన చెప్పిన అంజనాలు వేసే ఆయన గాని ఎవ్వడూ చెప్పలేద్సార్. అట్లాంటిది కొత్తగా వచ్చాడు సార్ కుర్రవాడు, చాలా బాగా చెప్తున్నాడు, నాకు డేట్‌తో సహా చెప్పాడు సార్.

"చెప్పినట్టుగానే కళ్యాణి ఫిలింస్ వాళ్ళది ఒకటి వచ్చింది. వరుసనే పదొచ్చినవి. లైఫులో యిదే బిజీ, మీకు తెలియనిదేముంది..." అంటూ తన పిక్చర్ల ప్రోగ్రెస్, కుర్ర జ్యోస్యుడి పాండిత్యం గురించి ఊక దంపుడుదంచాడు నిత్యం నమ్మకాలతో ఊగే రంగారావు.

"ఎవర్సార్! ఎక్కడ అడ్రస్ అతనిది..."

"మీరు తప్పకుండా కలవాలి అతన్ని!" అంటూ అడ్రస్ చెప్పి క్రిష్ణమూర్తి చేత రాయించేశాడు.

'ఎట్టి పరిస్థితులలోనైనా యితగాణ్ణి ఈ వేళ కలుసుకోవాలి. బెజవాడ సిద్ధాంతి చెప్పిన టైము దాటి పోవస్తోంది, ఏమీ మార్పు కనబడలేదు. ఆఖరి రెండు రోజులూ ఎల్లుండితో పూర్తి అనుకుంటూ ఏకాఎకిన ఆ సాయంత్రం రంగారావు చెప్పిన అడ్రస్‌కెళ్ళి వాకబు చేశాడు.

తీరా వెళ్ళి అడిగితే సిద్ధాంతిగారు కేంపు వెళ్ళారని తెలిసింది. అది విని అక్కడే నుండి కళ్యాణి ఫిలింస్ వాళ్ళు యివ్వవలసిన పాత బకాయి కోసం బయలు దేరాడు.

రోహిణి యింటర్నేషనల్ వద్ద కొచ్చి ఆగాడు, అటు గా వస్తున్న ఆటోని చూసి,

ఇంతలో వైట్ డ్రెస్ వేసుకుని సిగరెట్టు త్రాగుతూ నిల్చున్న ఓ వ్యక్తి క్రిష్ణమూర్తిని రమ్మన్నట్లు సౌంజ్ఞ చేశాడు.

అది చూసి క్రిష్ణమూర్తి 'ఏమిటి తననా లేక ఎవరినైనానా' అని వెనక్కి తిరిగి చూశాడు.

మళ్ళీ తననే అన్నట్టు సౌంజ్ఞ' వచ్చే సరికి నేరుగా వెళ్ళాడు 'ఏమి సార్?" అంటూ.

"మీరు క్రిష్ణమూర్తిగారు కదూ!" అన్నాడు అవతలి వ్యక్తి . 'అవున్సార్, మీరెవరు -, "అన్నాడు,' నన్ను అంత బాగా గుర్తించే ఆంధ్రులున్నారు కాబోలు' ననుకొంటూ యింతకాలం రామారావు, నాగేశ్వరరావు లకే అభిమానులున్నారని భావించే క్రిష్ణమూర్తి.

"నాపేరు మోహన్‌రావు. మాది అమలాపురం.

రండి మీతో మాట్లాడాలి, చాలా కాలం నుండి వున్న వారు సినీ యిండస్ట్రీలో, మీలాంటివాళ్ళ నడిగితే కరెక్టు యిన్ఫర్మేషన్ వస్తుంది" అంటూ...... '

ఇద్దరూ రోహిణి రూమ్ నెం 18కు నడిచారు.

"కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాడు - మోహనరావు.

"వేస్తారా" అంటూ బాటిల్ విప్పసాగాడు.

"వద్దు సార్! నాకాట్టే అలవాటు లేదు!' అంటూ వినయంగా తప్పించుకోబోయాడు క్రిష్ణమూర్తి.

"అలవాటు దేముంది సార్, కొంచెం తీసుకోండి" అంటూ గ్లాసునిండా నింపి క్రిష్ణమూర్తి చేతికి అందించాడు.

"విషయం ఏమిటో తెలియదు. చూస్తుంటే



యిదేదో ప్రొడ్యూసర్ లాగున్నాడు - ఎందుకైనా మంచిది కాదంటే మన మీద అభిప్రాయం వేరుగా వుండొచ్చు అనుకుని, మోహన్రావు చేతిలోని గ్లాసు అందుకున్నాడు.

"నేను ఒక పిక్చర్ తీద్దామని వచ్చాను సార్, వచ్చి ఈ రోజుకి సరిగ్గా నెలా పదిహేను రోజులవుతోంది.

నారాయణస్వామిని డైరెక్టర్‌గా పెట్టాలి, అడ్వాన్స్ తీసుకున్నాడు, ఇంకా ఎవరో క్రొత్త హీరోయిన్ అన్నాడు, ఆ అమ్మాయికి కూడా అడ్వాన్స్ యిప్పించాడు.

కథ విషయానికొచ్చేసరికి యిదిగో ఈ వేళ చెప్తాను - రేపు చెప్తాను అంటూ ఇరవై రోజులు గడిపేడు - మందూ, గిందూ ఏదైతేనే నెల పూర్తయ్యేసరికి ఏభై వేలు వేస్ట్ అయ్యాయి. దానితో నేను ఆయన్ని కట్ చేసుకుని వేరే ప్రయత్నంలో వున్నాను.

మీలాంటి వాళ్ళను అడిగి ఆలోచిద్దామని చూస్తున్నాను......" అంటూ తను చెప్పదలచుకున్నది వివరించేశాడు మోహన్రావు.

దేనికోసమైతే ఎదురు చూస్తున్నాడో అది ఒక్కసారి తనని వెతుకుతూ వచ్చినట్టనిపించింది క్రిష్ణమూర్తికి. మనస్సులో ఒక్కసారి బెజవాడ సిద్ధాంతి గ్రహాలను లెక్కకడుతూ క్లోజు షాట్‌లో కన్పించాడు. 'ఎంతైనా గట్టివాడే, అందుకే హైదరాబాద్‌లో అంత పలుకుబడి సంపాదించాడు' అనుకుంటూ...

"చేద్దాం సార్. తప్పకుండా, ముందుగా తెలిసుంటే మీకు అసలు డబ్బు వేస్ట్ అయి వుండేది కాదు - " అన్నాడు.

"నేను తప్పు పని చేశా, మొదట్లోనే మీలాంటి ఎక్స్‌పీరియన్స్ వున్నవారితో సంప్రదించి మీ గైడెన్స్ ఫాలో అయి వుండాల్సింది" అంటూ క్రిష్ణమూర్తికి సీనియారిటీ సర్టిఫికెట్టు యిచ్చాడు.

'మనం ఏమీ సాధించకపోయినా, ఈ పాటి సీనియారిటీ వున్న రీత్యా, వీడు మనల్ని గుర్తించాడు. వెధవది ఆంధ్రులు గుర్తించక పోయినా' అనుకున్నాడు వీడు ఆంధ్రుడు కానట్టుగా.

మోహన్రావు మనిషి నీటుగా, చెవుల మట్టానికి తమ్మెలు తీర్చి దిద్ది, సన్నటి ఫ్రెంచ్ కట్ మీసంతో చూచే వాళ్ళకి హుందాగా, అందంగా కన్పిస్తాడు.

మెడలో పులిగోరుతో వున్న చైన్, గోల్డ్ వాచీ, చేతి వేళ్ళకు రెండేసి ఉంగరాల చొప్పున నాలుగు వుంగరాలు ధరించాడు.

చూసిన వెంటనే మనిషి దుస్తుల ధారణని బట్టి లెక్క వేయడం క్రిష్ణమూర్తికి బాగా అలవాటు. కడారు నాగభూషణంగారులాంటివాళ్ళ నెందర్నో చూసిన వ్యక్తి కాబట్టి మోహన్రావుని, చేతులకి, మెడలోను వున్న బంగారం అంచనా వేసి వాటితోనే ఒక పిక్చర్ తీసేయ్యొచ్చనుకున్నాడు మనస్సులో, ఒక్కొక్క పెగ్గు విస్కీ మింగుతూ-

"సార్! మీకు రేపు షూటింగ్ ఏమైనా వుందా!"

"లేదు సార్, ఖాళీ యే రేపు—"

"ఐతే మీరు రేపు ఉదయం వస్తే అన్ని విషయాలు మాట్లాడుకుందాం" అంటూ తన గ్లాసులో పోసుకుని మిగిలింది కొంచెం వెలితిగా వున్న క్రిష్ణమూర్తి గ్లాసు నిండి పొర్లేటట్టుగా పోసేశాడు విస్కీ.

"చాలు సార్! చాలు, చాలు" అంటూ కంగారు పడ్డాడు. కొంతసేపటికి యిద్దరూ గ్లాసులు ఖాళీ చేసేశారు.

"సరేసార్! రేపు కలుద్దాం" అంటూ మోహన్రావు భోజనానికి లేచాడు. కృష్ణమూర్తికి త్రాగాలని లేకపోయినా, పిక్చర్ విషయం యింకా ఏమైనా మాట్లాడతాడేమోనని చూశాడు.

మోహన్రావు లేవడంతో తనూ లేచాడు.

ఒక్కసారి తనని వెనుక నుండి ఎవరో ముందుకి త్రోసినట్టైంది. కంట్లో మసక కమ్మింది. నిలబడి తమాయించుకున్నాడు. ఎప్పుడూ కన్నా డోస్ ఎక్కువైందని అనుకుంటూ బైటికి నడిచాడు.

కృష్ణమూర్తి రావడం, మోహన్రావు ఏవో విషయాలు మాట్లాడ్డం! ఒక్కో రోజు ఎంతో కొంత శుక్రతీర్థం యిద్దరూ సేవించడం జరుగుతోంది. ఇలా ఓ పది రోజులు గడిచింది,

ఐతే కృష్ణమూర్తి లాగానే వచ్చే వ్యక్తులు యింకా వున్నారు. పాపం మోహన్రావు ఎవరికిచ్చిన టైమింగ్స్‌లో వారితో మాట్లాడ్డం, వారిని సంతృప్తిపరచడం బాగా తెలుసు.

ఆదివారం ఉదయం సిగరెట్టు త్రాగుతూ కిటికీ గుండా చూస్తున్నాడు అటూయిటూ వెళ్తున్న వాహనాలని మోహన్రావు. ఇంతలో తలుపు చప్పుడైంది. వెళ్ళి తలుపు తెరిచాడు.

నవ్వుతూ ఫ్రెష్‌గా కన్పించాడు కృష్ణమూర్తి, "గుడ్ మార్నింగ్ సార్" అంటూ-

"గుడ్ మార్నింగ్, రండి, కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాడు. "సార్ యీవేళ నా లైఫ్‌లో ఎప్పుడూ పడనంత టెన్షన్‌గా వుంది "మోహన్రావు దిగాలుపడ్డ ముఖంతో"

'ఏమైందండి సార్ -" అన్నాడు కృష్ణమూర్తి తనేదో ఆ ప్రోబ్లమ్ అన్నట్టు ఫోజు పెట్టి.




"ఏమీ లేదు, ఫ్రెండొకాయన ఇరవై వేలు తీసుకెళ్ళాడు షెడ్యూల్‌కి తక్కువగా వుందని, యివ్వాటికి తెచ్చి ఇస్తానన్నాడు. అలాంటిది యిప్పటికి యింకా అందలేదది.

ఈ వేళ తర్టీఫస్ట్! లాడ్జి అడగకుండా కట్టడం మనకు అలవాటు, వారు అడిగేసరికి యివ్వకపోతే రభస, అలాంటిది మనకి కుదరదు" అన్నాడు తన హోదాని గుర్తించేటట్టుగా-

"ఓపని చేస్తారా మీరు -" మళ్ళీ తనే.

"ఏమిటి సార్!" అన్నాడు కృష్ణమూర్తి దేనికైనా సిద్ధంగా వున్నట్టుగా

"ఈ చైన్ తీసికెళ్ళి తాకట్టు పెట్టి ఓ పది తీసుకురండి. నాల్గు రోజుల్లో తిరిగి విడిపించేద్దురు గాని......" కృష్ణమూర్తికి అవకాశం ఏదో లభించినట్టైంది. ఆలోచించాడు ఒక్కసారి 'తన ఫ్రెండు ఓ పాతిక వున్నట్టు సినిమా గురించి అస్తమాను తనని అడుగుతున్నట్టు జ్ఞాపకం వచ్చింది - సరే వెళ్ళి వాడిని చూద్దాం- వాడు యిచ్చాడంటే, తీసుకొచ్చి యితగాడికి ఈ టైములో యిచ్చామంటే - మన మీద ఓ పెద్ద గురి వుంటుంది, దాంతో మనకి బాగా దగ్గరగా వుంటాడు. అని దూరంగా ఆలోచించాడు కృష్ణమూర్తి.

"ఏమిటి సార్ ఆలోచిస్తున్నారు, ఏం... మీకు ఏమైనా పనుందా!" అన్నాడు మోహన్రావు-

'లేదు సార్- గొలుసు అక్కరలేదు. నేను ట్రై చేసి మధ్యాహ్నం కల్లా తీసుకొస్తాను" అంటూ కదిలాడు-

బెజవాడ సిద్ధాంతి చెప్పిన నీచభంగరాజ యోగమంటే ఈ విధంగా వుంటుంది కాబోలునని అనుకున్నాడు కృష్ణమూర్తి తేనాంపేటలో వున్న ఓ సందులో దూరుతూ...

"రా! బావా రా!" అంటూ ఆహ్వానించాడు కృష్ణమూర్తిని అల్లంత దూరంలో చూసి,

'గురూ! కృష్ణతో మాట్లడాను మొన్న, కన్‌సెషన్ బాగా యిస్తాడు మనకి, యిదే ఛాన్సు ఒక చిన్న ఎమౌన్ట్ మెంటు యిచ్చేద్దాం.

"సరే అలాగే! నేనెప్పుడో రెడీ అన్నాను గదా!" అన్నాడు ఆ పాతికవేల ప్రొడ్యూసర్ సినిమా మోజు మీద.

"సరే ఐతే ఓ ఆరు చూడు యిప్పుడు! మిగిలిన నాలుగు నా దగ్గర వున్నాయి' అని పచ్చి అబద్ధం ఆడాడు.

"ఆరంటే రేపటి వరకు ఆగాలి. మొన్న మా బావమర్ది సరుకు విడిపించడానికని చేబదులుగా తీసుకున్నాడు. రేపు తీసుకొచ్చి యిస్తాను..."

"ఇప్పుడు రెడీగా ఎంతుంది!"

"ఇంట్లో ఓ మూడు వరకూ వుంటుంది"

"సరే అదియ్యి. నాదగ్గరున్న దేసి సరిపెడతాను, నువ్వు తీసుకొచ్చిన తర్వాత మిగిలినది మనమిద్దరమూ వెళ్ళి యిద్దాం కృష్ణకు" అన్నాడు

తను డైరెక్టుగా హీరో దగ్గరికి వెళ్ళి అడ్వాన్స్ యివ్వడం అనేసరికి ఒక్కసారి ఒళ్ళు పులకించింది, తను ఆ రోజు సినిమా పత్రికలో చదివే ప్రొడ్యూసర్లే ప్రక్కగా నిలబడినట్లు అనిపించింది లాంగ్ షాట్‌లో.

లోపలికి వెళ్ళి యింట్లో నాలుగు చోట్ల పెట్టేంది

తడిమి తీసుకుని వచ్చి యిచ్చాడు కృష్ణమూర్తికి. అది తీసుకుని సరాసరి నేరుగా కళ్యాణి ఫిలింప్ ఆఫీస్‌కి వెళ్ళాడు.

'అబ్బా బ్రతికించావురా భగవంతుడా!' అనుకున్నాడు- ఎప్పుడూ ఆఫీసులో దొరకని ప్రొడ్యూసర్ రఘురామ రెడ్డిని చూసేసరికి

"నమస్కారం సార్!" అంటూ పరమానందంతో విష్ చేశాడు.

"రండి" అంటూ సాదరంగా ఆహ్వానించాడు రెడ్డి, "మీ బేలెన్స్ తీసేసుకోండి. నేను మళ్ళీ హైదరాబాద్ వెళ్ళాలి," అంటూ ఆ మాటతో ప్రపంచంలో అదృష్టం అంతా తవదేలా అన్పించింది కృష్ణమూర్తికి.

చెక్కు యిస్తాడనుకున్న రెడ్డి తీరా కేష్ యిస్తుంటే అదీ రెండు పిక్చర్లదీ కలిపి యివ్వడంతో కృష్ణమూర్తికి ప్రపంచాన్ని జయించినంత ఆనందం కల్గింది ఒక్కసారి.


అది తీసుకుని హడావిడిగా రోహిణీ ఇంటర్నేషనల్‌కి వచ్చి మోహన్రావు ముందు వాలాడు చంద్ర మండలం నుండి వచ్చిన ప్రథమ మానవుడిలా.

కళ్ళు మిలమిల మెరిసినయి మోహన్రావుకి, లెక్క పెట్టాడు'

"మీరు భోజనం చేశారా? చేస్తారా!" అన్నాడు.

"లేదు సార్ చేసేశాను" అన్నాడు ఎప్పుడూ తను టైముకి భోంచేసేవాడిలా,

"మీకు శ్రమ యిచ్చానూ సార్, రెండ్రోజులలో




పర్దేద్దురుగాని..."

"ఇద్దరుగాని, దానికేం ఫరవాలే" అన్నాడు కృష్ణమూర్తి మోహన్రావుతో పార్టనరైపోయినట్టు.

ఆ రోజు సాయంకాలం వరకూ పిక్చర్ బడ్జెట్ గురించి, మార్కెట్టున్న డైరెక్టర్ల గురించి తీవ్రంగా చర్చించారు యిద్దరు-

బెజవాడ సిద్ధాంతి ప్రెడిక్షన్ రోజు-రోజుకి కృష్ణమూర్తిని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

ఆ మర్నాడు యథాప్రకారం రోహిణీ మెట్లన్ని ఎక్కి ఎడమ వైపుకి తిరిగాడు, మోహన్రావు రూముకి తాళం కప్ప వ్రేలాడుతోంది. గుమ్మం దగ్గరకి వెళ్ళి చూశాడు కిటికీ నుండి లోనికి. లోన ఏ సామాన్లు లేవు. బెడ్, చైర్స్ తప్ప. గబ-గబా క్రిందకి దిగి వచ్చి మేనేజర్ని అడిగాడు మోహన్రావు రూమ్ నెంబరు చెప్పి-

"అతను రాత్రే ఖాళీ చేసేశాడు, ఏం మీదగ్గరా ఏమన్నా తీసుకున్నాడా?" అన్నాడు-

'ఏం ఎవరన్నా వచ్చారా ఆయన గురించి?"

"ఉదయం అప్పుడే ముగ్గురొచ్చారు - ఏదో పార్టనర్స్‌గా చేరదామని ఆయనకి చేబదుళ్ళుగా యిచ్చారట ఓ ముప్పై వరకు!"

ఆ మాటతో కృష్ణమూర్తి గుండె ఆగినంత పనయ్యింది. కండ్లకి చీకటి క్రమ్మినట్లైంది. కొంత సేపు ఏమీ కన్పించలేదు.

నెమ్మదిగా నడిచాడు బైటకి.

శూన్యంలోకి చూస్తున్నా చూపు తడికమ్మి మసక బారింది.

ఆ రోజు రవికిరణ్‌తో మాట్లాడుతుంటే వెనుక సీట్లో కూర్చొని తనను అస్తమానూ పరిశీలనగా చూసింది యీ మోహన్రావేనని - యిప్పటికీ తట్టలేద తనికి

*


# ఉగాది సందేశం

ఆంధ్రుల అభిమానానికీ, అభిరుచికీ తగిన అనేక ఉత్తమ గ్రంథాలని ప్రచురిస్తున్న నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా 'అంతర భారతీయ పుస్తకమాల'గా సరసమైన ధరలకి వెలువరించిన కొన్ని ఉత్తమ భారతీయ సాహిత్య కుసుమాలకి తెలుగు అనువాదాలు .

| | |
|---|---|
| అగ్నిధారం | రు. 6.75 |
| జీవితం ఒక నాటక రంగం | " 4.50 |
| అరగడియ | " 16.50 |
| తెల్లని రక్తం | " 5.75 |
| చిత్రసుందరి | " 10.25 |
| నేను | రు. 4.00 |
| ముక్తి | " 10.75 |
| ప్రాచీన లక్నో | " 7.00 |
| బన్‌గర్ వాడి | " 2.75 |

ఈ పుస్తకాలు ప్రముఖ విక్రేతల వద్ద మరియు ఎన్.బి.టి. బుక్ సెంటర్, సిటీ సెంట్రల్ లైబ్రరీ, అశోకనగరం, హైదరాబాదు- 500 020, విక్రేత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, ఎ-4 గ్రీను పార్కు, క్రొత్త ఢిల్లీ - 110 016 వద్ద లభిస్తాయి.

## నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా